దుంప రైతుకు గిట్టుపోటు

- కన్నీళ్లు మిగిల్చిన కర్ర పెండలం
- గిట్టుబాటు కాని ధర
- తగ్గిపోతున్న విస్తీర్ణం

రంగంపేట: సగ్గుబియ్యం తయారీకి ప్రధాన ముడి సరుకైన కర్ర పెండలం సాగు చేసిన రైతులకు ఈ ఏడాది కన్నీళ్లే మిగిలాయి. ఫిబ్రవరి 10వ తేదీన ప్రారంభమైన కర్ర పెండలం దుంప పంట ఇప్పుడు ముగింపు దశకు చేరుకుంది. సాధారణంగా ముగింపు దశలో పుట్టుకు (225 కిలోలు) వంద రూపాయలు పెంచి (పాత ధరపై) ఇవ్వడం ఆనవాయితీ అయినా, ఈ ఏడాది అది కూడా రైతులకు దక్కలేదు. పెరిగిన భూమి శిస్తులు, పెట్టుబడుల కారణంగా ఈ ఏడాది రైతులు పుట్టుకు రూ.1,800 ఆశించారు. కనీసం రూ.1600 ఇస్తారని ఎదురుచూశారు. కానీ మిల్లర్లు ఏకమై కేవలం రూ.1200 మాత్రమే నిర్ణయించడంతో రైతులు తీవ్ర నష్టానికి గురయ్యారు. చిత్రం ఏమిటంటే గత ఏడాది రూ. 1400 చెల్లించారు.


కర్రపెండలం దుంపను తీస్తున్న రైతు


మిల్లులకు తరలించడానికి సిద్ధం చేసిన కర్ర పెండలం

భారీగా తగ్గిన విస్తీర్ణం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఒక దశలో ఈ పంట 80 వేల ఎకరాలకు విస్తరించింది. తర్వాత గిట్టుబాటు ధర సమస్య ఏర్పడటంతో మెల్లమెల్లగా తగ్గిపోతూ 2010 నాటికి 30 వేల ఎకరాలకు పడిపోయింది. గతేడాది 12 వేల ఎకరాల్లో సాగు కాగా, ఈ సంవత్సరం 10 వేలకు తగ్గిపోయింది. పదేళ్లుగా అన్ని పంటలకు ధర పెరుగుతున్నా కర్ర పెండలానికి మాత్రం ధర తగ్గుతుండడంతో రైతులు ఇతర పంటలకు వెళ్లిపోయారు. ముఖ్యంగా ఆయిల్ పామ్ సాగు రావడంతో దుంప క్షేత్రాలన్నీ ఆయిల్‌పామ్ తోటల్లా మారిపోయాయి.

మిల్లులపై ప్రభావం

విస్తీర్ణం తగ్గడంతో దాని ప్రభావం సగ్గుబియ్యం మిల్లులపై కూడా పడింది. గతంలో 40 సగ్గుబియ్యం మిల్లులు ఉండగా ఇప్పుడు 10కి పడిపోయింది. గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 28 మండలాలకు విస్తరించిన ఈ పంట ఇప్పుడు 8 మండలాలకు కుదించుకుపోయింది. ప్రస్తుతం ఈ పంటను రెండు, మూడు ఎకరాలు ఉన్న సన్నకారు, చిన్నకారు రైతులు, గొట్టపు బావుల్లేని రైతులు మాత్రమే సాగు చేస్తున్నారు. జగ్గంపేట, పెద్దాపురం , రంగంపేట మండలాల్లో ఉన్నంతలో కాస్త ఎక్కువగా ఈ పంటను రైతులు సాగు చేస్తున్నారు. ఈ పంట కొనసాగాలంటే పుట్టుకు కనీసం రూ.1800 నుంచి రూ.2 వేలు ఇవ్వాలని రైతులు అంటున్నారు.

ఆధునిక వంగడాల కొరత

కర్ర పెండలం దుంప పంటను ప్రధానంగా ఆధునిక వంగడాల కొరత వేధిస్తోంది. తమిళనాడులో ఎకరానికి 45 పుట్లు దుంప దిగుబడి వస్తుండగా మన జిల్లాలో అది కేవలం 20 నుండి 25 పుట్లుకు మాత్రమే పరిమితమైంది. ఈ కారణంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ తగిన చర్యలు తీసుకుని తమిళనాడు నుంచి ఆధునిక దుంప వంగడాలను తీసుకువచ్చి రాయితీ ధరకు రైతులకు అందించాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కర్ర పెండలం దుంప రైతుల సంఘం గౌరవ అధ్యక్షుడు పుట్టా సోమన్న చౌదరి విజ్ఞప్తి చేశారు. సగ్గుబియ్యం ధర అంతంత మాత్రమే ఉండడం వల్ల తాము రైతులకు గిట్టుబాటు ధర చెల్లించలేక పోతున్నామని సగ్గుబియ్యం మిల్లర్లు చెబుతున్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి



గిట్టుబాటు ధరగా పుట్టు దుంప (225 కిలోలు)కు రూ.2 వేలు అందిస్తే రైతులకు ప్రస్తుత పరిస్థితుల్లో గిట్టుబాటు అవుతుంది. లేకపోతే జిల్లాలో ఈ పంట సాగు కనుమరుగవుతుంది.

– పుట్టా సోమన్న చౌదరి, జిల్లా దుంప రైతు సంఘం గౌరవ అధ్యక్షుడు, మర్రిపూడి

మేలురకం విత్తనాలు అందించాలి



పరిశోధనా కేంద్రాల ద్వారా తగినన్ని మేలురకం విత్తనాలు అందించాలి. గొట్టపు బావుల ద్వారా సాగునీటి వసతి కల్పించాలి. రైతులకు తగిన ప్రోత్సాహకాలు ఇవ్వాలి.

– వేము దేవానందం, రైతు, మర్రిపూడి

బెదిరింపులతో లొంగదీసుకున్నారు

- ఎమ్మెల్యే నల్లమిల్లి అసత్య ప్రచారం తగదు
- మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణ రెడ్డి



పెదపూడి: ఇటీవల బిక్కవోలు మండల పరిషత్ అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో స్థానిక బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అధికార ఎన్డీఏ కూటమి నాయకులు బెదిరింపులు, ప్రలోభాలతో వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులను లొంగతీసుకున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గం కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆరోపించారు. ఈ మేరకు సోమవారం అనపర్తిలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బిక్కవోలు మండలంలో 20 మంది ఎంపీటీసీ సభ్యులు వైఎస్సార్ సీపీ గుర్తుపై గెలిచారన్నారు. వారిని ఎన్డీఏ నాయకులు బెదిరింపులు, ప్రలోభాలతో లొంగదీసుకున్నారన్నారు. కానీ రాష్ట్రంలో బీజేపీ తరఫున గెలిచిన మొదటి మండల పరిషత్ పీఠంగా గొప్పలు చెప్పుకుంటూ ఎమ్మెల్యే నల్లమిల్లి ప్రచారం చేస్తున్నారన్నారు. అసలు బిక్కవోలు మండల పరిషత్‌లో బీజేపీ గుర్తు కమలంపై గెలిచిన ఒక్క ఎంపీటీసీ సభ్యుడు కూడా లేరన్నారు. అలాంటప్పుడు బీజేపి ఎంపీపీ ఎలా గెలిచినట్లు అవుతుందని ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి కూడా స్థానిక ఎమ్మెల్యే తప్పుడు సమాచారం అందిస్తున్నారని విమర్శించారు.

ప్రవీణ్ మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలి


సీతానగరంలో ర్యాలీ చేస్తున్న పాస్టర్లు


వెంకటాపురంలో శాంతి ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

సీతానగరం: పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై సమగ్ర దర్యాప్తు చేసి, దోషులను కఠినంగా శిక్షించాలని సీతానగరం పాస్టర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం పాస్టర్ నారాయణమూర్తి ఆధ్వర్యంలో మండల ఐక్య క్రైస్తవులు శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. పాస్టర్ నారాయణమూర్తి మాట్లాడుతూ రాజమహేంద్రవరం రూరల్ కొంతమూరు – దివాన్ చెరువు హైవేలో పాస్టర్ ప్రవీణ్ మృతదేహం లభ్యమైందన్నారు. అది హత్యా, ప్రమాదమా అనే విషయాన్ని నిగ్గుతేల్చాలని డిమాండ్ చేశారు. అనంతరం సీతానగరం పోలీస్ స్టేషన్‌లో వినతిపత్రం అందించారు.

క్రైస్తవుల శాంతి ర్యాలీ

రంగంపేట: పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణంపై సమగ్ర దర్యాప్తు చేసి, తగిన న్యాయం చేయాలని కోరుతూ సోమవారం వెంకటాపురం గ్రామంలో స్థానిక హోలీ స్పిరిట్ ఫైర్ మినిస్ట్రీస్ చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి వద్ద పాస్టర్ ప్రవీణ్ మృతికి సంతాపం తెలియజేస్తూ, శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో పాస్టర్ కె.సర్జన్ రాజ్, సంఘ పెద్దలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాల ప్రదానం


ఉగాది పురస్కారాలు అందుకున్న పండితులు

కోరుకొండ: గ్రామంలోని హరేరామ సమాజం కల్యాణ మండపంలో భార్గవ గాయత్రీ బ్రాహ్మణ సేవా సమాఖ్య అధ్యక్షుడు పరస శ్రీను ఆధ్వర్యంలో సోమవారం ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా 8 మంది పండితులను ఘనంగా సత్కరించారు. కపిలివాయి నమశ్వివాయ శర్మ పంచాంగ పఠనం చేశారు. మార్గాపుర నరసింహాచార్యులు మాట్లాడుతూ విశ్వావసు నామసంవత్సర విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో సమాఖ్య గౌరవాధ్యక్షుడు డాక్టర్ పెద్దింటి విద్యాసాగర్, పండితులు జోస్యుల భగవాన్ శర్మ, ముత్యరాజు, కొక్కిరిగడ్డ దుర్గాప్రసాద్, కర్రి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ యువత ఉపాధికి బాటలు

సీటీఆర్ఐ: రాష్ట్రంలో బ్రాహ్మణ యువతకు విద్య, ఉపాధి రంగాల్లో బాటలు వేస్తామని రాష్ట్ర బ్రాహ్మణ యువజన సమాఖ్య అధ్యక్షుడు, న్యాయవాది సూరంపూడి కామేష్ అన్నారు. బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు మాదిరాజు శ్రీనివాసులను రాజమహేంద్రవరంలో సోమవారం ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కామేష్ దంపతులను దుశ్శాలువతో జిల్లా బ్రాహ్మణ నగర ప్రతినిధులు సత్కరించారు. కామేష్ మాట్లాడుతూ బ్రాహ్మణ యువత మేధావులుగా తయారు చేసే అన్ని కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా చేపడతామన్నారు. సాంకేతిక పద్ధతులు ద్వారా విద్య, ఉపాధి అవకాశాలను వారికి అందజేస్తామన్నారు. జిల్లా కార్యదర్శి కలగా సుబ్రహ్మణ్యం, నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు దూర్వాసులు సత్యనారాయణ, నగర యువజన కార్యదర్శి గుడిపూడిం సునిల్ గౌతమ్ పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

పెదపూడి: గ్రామ దేవతలను నిత్యం పూజించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గం కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. కరకుదురు గ్రామంలో నూతనంగా నిర్మించిన సత్తెమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని సూర్యనారాయణరెడ్డి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో హితకారిణి సమాజం మాజీ డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ, పార్టీ గ్రామ కన్వీనర్ పెమ్మనబోయిన గోవిందరాజులు, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, వల్లూరి పట్టాభి, యెండ్రు సుబ్బారావు, అల్లం బాబులు, మద్దూరి ఆదినారాయణ, కర్రి బుజ్జి, అడపా రాము, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

దొర్లాంబిక అమ్మవారికి పూజలు

పెదపూడి: అనపర్తి మండలం పీర రామచంద్రపురంలో కొలువైన దొర్లాంబిక అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సోమవారం దర్శించుకున్నారు. కార్యక్రమంలో అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు కోనాల సాయి రామారెడ్డి, పులపకూర గంగరాజు, తమలంపూడి సత్యనారాయణరెడ్డి, తమలంపూడి రాజేంద్రరెడ్డి, తాడి సుధాకర్‌రెడ్డి, తాడి సీతారామారెడ్డి, చిర్ల బసిరెడ్డి, చిర్ల సత్యనారాయణరెడ్డి, నల్లమిల్లి చిన్న వెంకటరెడ్డి, కోనాల వీర వెంకట సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.


కరకుదురులో సత్తెమ్మ తల్లిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి తదితరులు


పీర రామచంద్రపురంలో దొర్లాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

ఘనంగా పుత్రకామేష్టి యాగం


పుత్రకామేష్టి యాగంలో పాల్గొన్న హనుమంతాచార్యులు, ఫణీశ్రీ దంపతులు

పెదపూడి: సంపర గ్రామంలోని రామాలయంలో జరుగుతున్న 59వ శ్రీరామ సప్తాహాల్లో భాగంగా సోమవారం రెండో రోజు పుత్రకామేష్టి యాగం నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం వేద పండితుడు గంగాధరభట్ల విష్ణుశర్మ ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా విష్ణుశర్మ మాట్లాడుతూ సప్తాహ మహోత్సవాలకు భక్తులు, గ్రామస్తులు హాజరై స్వామి వారి అనుగ్రహం పొందాలన్నారు. యాగ పూజల్లో ప్రముఖ పండితుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు, ఫణీశ్రీ దంపతులు యజ్ఞకర్తలుగా కూర్చున్నారు. యాగం అనంతరం భక్తులకు యజ్ఞ పాయసం పంపిణీ చేశారు.

మార్మోగిన సత్యసాయిబాబా నామస్మరణ

రంగంపేట: సత్యసాయి నామస్మరణతో కోటపాడు గ్రామం మార్మోగింది. సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆ గ్రామంలో బాబా చిత్రపటం ముందు రెండు గంటల పాటు 50 ఇళ్లలో భజనలు చేసినట్టు సత్యసాయి సేవాసమితి కన్వీనర్ కందర్ప వెంకట అమర్నాథ్, నిర్వాహకుడు కందర్ప రాంబాబు మాస్టారు తెలిపారు. ప్రతీ ఇల్లు దైవనామస్మరణతో ఆధ్యాత్మికంగా, ఆనందంగా గడపాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని, దీనికి గ్రామస్తుల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో 100 ఇళ్లలో ఒక్కొక్క ఇంటిలో గంట చొప్పున 100 గంటల భజన కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో రంగంపేట సబ్‌జోన్ కన్వీనర్ మర్రెడ్డి వీర్రాజు, జిల్లా వేదాధ్యయన సమన్వయ కర్త కందర్ప శ్రీరామ శర్మ, విద్యా విభాగ సమన్వయ కర్త ఎల్.శ్రీనివాసరాజు, ఈలకొలను సేవా సమితి కన్వీనర్ తిక్కిశెట్టి సుబ్బారావు, సబ్ జోన్ ఆధ్యాత్మిక సమన్వయ కర్త తోటకూర సత్యనారాయణ పాల్గొన్నారు.


కోటపాడులో సత్యసాయిబాబా చిత్రపటం వద్ద భజనలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

- మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు
- తరలివచ్చిన ముస్లింలు


పందలపాకలో మాట్లాడుతున్న షేక్ గులాం గౌస్ రిజ్వి

సీతానగరం: రంజాన్ వేడుకలను సోమవారం రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సీతానగరంలోని అజీజియా మసీదులో మౌజన్ షేక్ ఉమర్ షరీఫ్ మాట్లాడుతూ మత సామరస్యానికి చిహ్నమే రంజాన్ అన్నారు.

▸▸ వంగలపూడిలోని నూర్ ముబారక్ మసీదులో అంతర్జాతీయ అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ ఆధ్వర్యంలో ఈదుల్ ఫితర్ (రంజాన్) వేడుకలు ఘనంగా నిర్వహించారు. మసీదు గురువు మహ్మద్ అక్బర్ మాట్లాడుతూ పండగ విశిష్టతను వివరించారు. మసీదు అధ్యక్షుడు షేక్ ఖాసిం ఫరూక్, షేక్ నాగూర్ సాహెబ్, షేక్ అహ్మద్ అలీ ఉద్దీన్ పాల్గొన్నారు

బిక్కవోలులో..

బిక్కవోలు: బిక్కవోలు గ్రామంలోని మదీనా మసీదు వద్ద వద్ద ఇమామ్ (గురువు) మహమ్మద్ షజాహద్ అష్రఫి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. పందలపాకలోని బిలాల్ మసీదులో మత గురువు షేక్ గులాం గౌస్ రిజ్వి సందేశం ఇచ్చారు. అలాగే అహల్లె సున్నత్ వలె జమాతే జామియా మసీదులో, బలభద్రపురంలో ప్రార్థనలు జరిగాయి.

కోరుకొండలో..

కోరుకొండ: మండలకేంద్రమైన కోరుకొండలో మత గురువు సయ్యద్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో ముస్లింలు ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. షేక్ సుభాన్ సాహెబ్, మొహిద్దీన్, వక్ఫ్‌బోర్డు మాజీ సభ్యుడు బిజిలానీ, కమిటీ సభ్యులు షేలార్, నవీన్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.


కోరుకొండ మసీదులో ప్రార్థన చేస్తున్న ముస్లింలు

హౌసింగ్ బోర్డు కాలనీలో..

రాజానగరం: లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలోని మసీదులో జరిగిన రంజాన్ వేడుకలలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సతీసమేతంగా పాల్గొన్నారు. రంజాన్ ప్రత్యేకతను తెలియజేస్తూ, ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులను మసీదు నిర్వాహకులు సన్మానించారు. అలాగే రాజానగరం, దివాన్‌చెరువులోని మసీదుల్లో రంజాన్ వేడుకలు జరిగాయి.


సీతానగరం అజీజియా మసీదులో ముస్లింలు


లాలాచెరువులో ముస్లింలతో ఎమ్మెల్యే బలరామకృష్ణ దంపతులు


వంగలపూడి మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

క్లుప్తంగా

ఇంటి పన్నులు నూరుశాతం వసూలు

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు పంచాయతీలో ఇంటి పన్నులను నూరు శాతం వసూలు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి కర్రి సత్యనారాయణరెడ్డి అన్నారు. ఆయన సోమవారం మాట్లాడుతూ 2024–25 సంవత్సరం 1,765 మంది నుంచి రూ.20,95,967 వసూలు చేసినట్లు తెలిపారు. దీనికి సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇంటి పన్నులు వసూలు చేసిన పంచాయతీ కార్యదర్శి, సిబ్బందిని సర్పంచ్ సత్తి వీరమణి అభినందించారు.

వసంత నవరాత్ర ఉత్సవాలు ప్రారంభం


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

బిక్కవోలు: కొంకుదురు బుడతల మామిడి వద్ద కొలువైన శ్రీభూదేవి పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వసంత నవరాత్ర ఉత్సవాలు ఆదివారం సాయంత్రం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. అర్చకుడు రమణ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు చేసి, అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. మల్లిడి కోదండం బ్రదర్స్ అన్ని ఏర్పాట్లు చేసి ప్రసాద్ వితరణ చేశారు.

సత్తెమ్మ తల్లికి పూజలు

పెదపూడి: కరకుదురులో సోమవారం జరిగిన సత్తెమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే గ్రామంలో ప్రారంభమైన శ్రీరామ సప్తాహాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పెద్దాడ సాగునీటి డీసీ చైర్మన్ సానా శ్రీనివాసు, మాజీ సర్పంచ్ సింగిలిడి నాగ తిరుపతిరావు, జనసేన నియోజకవర్గం కో ఆర్డినేటర్ నాగు, టీడీపీ నియోజకవర్గం మహిళా విభాగం అధ్యక్షురాలు జత్తుక సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కోలాటం


బలభద్రపురంలో ఆకట్టుకున్న కోలాటం

బిక్కవోలు: బలభద్రపురం గ్రామంలోని తోటలో మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద జరిగిన కోలాటం అలరించింది. అమ్మవారి తీర్థాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆలయం కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రైట్ కళాశాలలో వర్క్‌షాప్

రాజానగరం: భూపాలపట్నంలోని రైట్ ఇంజినీరింగ్ కళాశాలలో మెంటర్లీ ఏ–1 సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు వర్క్‌షాప్ జరిగిందని కళాశాల డైరెక్టర్ అద్దాల శ్రీహరి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆ సంస్థ వ్యవస్థాపకుడు వికాస్ కుమార్ రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించారన్నారు. టీమ్ బిల్డింగ్, యాప్ డెవలప్‌మెంట్, బిజినెస్ అండ్ కెరీర్ డెవలప్‌మెంట్‌పై విద్యార్థులకు అవగాహన కలిగించడంతో పాటు బిజినెస్ ఐడియాలపై చర్చించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాస్కర్ ముత్యాలు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీధర్, ట్రెజరర్ పి.రవికిరణ్, హెచ్‌ఓడీ డాక్టర్ ఆర్. రాంబాబు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన కార్యదర్శిగా శివకుమార్



విజయవాడలో ప్రమాణ స్వీకారం చేస్తున్న శివకుమార్

సీతానగరం: రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘానికి మొదటి ప్రధాన కార్యదర్శిగా వంగలపూడికి చెందిన డాక్టర్ సూరెడ్డి శివకుమార్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలోని స్వాతంత్ర్య సమర యోధుల భవనంలో రాష్ట్ర అడహక్ కమిటీ కన్వీనర్ కె.గోవిందరావు సూచనల మేరకు సంఘం గౌరవాధ్యక్షుడు అన్నె రామారావు సమక్షంలో మాజీ సైనికుల రాష్ట్ర కమిటీని ఎంపిక చేశారు. వంగలపూడికి చెందిన నేవీ మాజీ సైనికుడు డాక్టర్ సూరెడ్డి శివకుమార్ సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు.

దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం

రంగంపేట: పెదరాయవరం గ్రామంలోని కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద నిర్వహించిన అన్నసమారాధనకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.